# మాకు నిధులా! ఎక్కడివి.. ఎవరిచ్చారు?

**గతేడాది దాకా టోర్నీలకు సొంతంగానే ఖర్చు • మేం అడిగిన కోచ్‌నూ ఇవ్వలేదు • బ్యాడ్మింటన్ ప్లేయర్ అశ్విని పొన్నప్ప గరంగరం**



ఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు గాను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నుంచి తనకు వ్యక్తిగత శిక్షణ కింద రూ. 4.50 లక్షలు, 'టాప్స్' స్కీమ్ కింద రూ. 1.48 కోట్లు అందాయన్న వార్తలపై భారత బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారిణి అశ్విని పొన్నప్ప తీవ్రంగా స్పందించింది. తనకు సాయ్ నుంచి గానీ ఇతర సంస్థల నుంచీ ఎలాంటి నిధులూ అందలేదని వెల్లడించింది. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'ఆ వార్తలు చూసి నేను షాక్‌కు గురయ్యా. నిధులు రానందుకు నాకేం బాధ లేదు. కానీ మేం తీసుకోకున్నా డబ్బులు పొందామని దేశ ప్రజల ముందు ఇలా చెప్పడం దారుణం. క్యాంపులు, విదేశీ శిక్షణ నిమిత్తం ఖర్చు చేశామని వాళ్లు (సాయ్) చెబుతున్నారు. కానీ రూ.1.48 కోట్లు వెచ్చించింది నా ఒక్కదానిమీద కాదు. క్యాంపులో ఉన్న వారందరికీ ఖర్చు చేశారు. అదీగాక ఆన్యువల్ క్యాలెండర్ ఫర్ ట్రైనింగ్ కాంపిటీషన్ (ఏసీటీసీ) కోసం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్)కు సాయ్ నుంచి వచ్చినవే తప్ప ప్రత్యేకంగా ఏమీ ఖర్చు చేయలేదు. నాకు వ్యక్తిగతంగా కోచ్ కూడా లేదు. పర్సనల్ ట్రైనర్‌కు నా సొంతంగానే నిధులు ఖర్చు చేశా. నేను ఎవరి నుంచీ ఒక్క రూపాయి అదనంగా తీసుకోలేదు. 2023 నవంబర్ దాకా నా సొంత డబ్బులతోనే టోర్నీలకు వెళ్లాను. మేం ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాతే మమ్మల్ని (తనీషా క్రాస్టోతో కలిసి) టాప్స్‌లో చేర్చారు. గతేడాది నాకు అటు అసోసియేషన్ నుంచి ఎలాంటి మద్దతూ లేదు. అయినప్పటికీ నా మీద రూ. 1.5 కోట్లు ఖర్చు చేశామని చెప్పడం సరికాదు' అని తెలిపింది.



## పారా షట్లర్ ప్రమోద్‌పై ఏడాదిన్నర నిషేధం

ఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన భారత పారా షట్లర్ ప్రమోద్ భగత్‌కు భారీ షాక్ తగిలింది. డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిన అతడిపై వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) 18 నెలల నిషేధం విధించినట్టు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) తెలిపింది. గత ఏడాది కాలంలో 3 సార్లు డోపింగ్ పరీక్షలకు వివరాలు వెల్లడించనందుకు గాను అతడిపై చర్యలకు దిగినట్టు బీడబ్ల్యూఎఫ్ వెల్లడించింది. ఈ నిర్ణయంతో ప్రమోద్ త్వరలో జరుగబోయే పారిస్ పారాలింపిక్స్‌కు దూరం కానున్నాడు. 2025 సెప్టెంబర్ 01 దాకా అతడిపై ఈ నిషేధం కొనసాగనుంది. పారిస్ పారాలింపిక్స్‌కు సిద్ధమవుతున్న క్రమంలో ఈ నిషేధం ఎదుర్కోవడంపై ప్రమోద్ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

## కేరళ నుంచి తొలి మహిళా ఎఫ్1 డ్రైవర్

**రేసింగ్‌లో రాణిస్తున్న సల్వా మార్జన్**



కొచ్చి: కేరళ నుంచి తొలి మహిళా ఫార్ములావన్ రేసర్ దూసుకొచ్చింది. కోజికోడ్‌కు చెందిన సల్వా మార్జన్.. రేసింగ్‌లో అదరగొడుతున్నది. సరిగ్గా పదేండ్ల క్రితం రేసింగ్ కెరీర్ ప్రారంభించిన ఈ 25 ఏండ్ల యువ రేసర్ వచ్చే ఏడాది జనవరిలో జరిగే అంతర్జాతీయ రేసింగ్ సమాఖ్య(ఎఫ్ఐఏ) గుర్తింపు పొందిన రేసింగ్‌లో పోటీపడబోతున్నది. ప్రస్తుతం యూఏఈలో శిక్షణ తీసుకుంటున్న సల్వా ప్రస్తుతం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నది. రేసింగ్‌లో మెరుగైన శిక్షణ కోసం అధిక మొత్తం ఖర్చు చేయాల్సి వస్తుండటంతో బిజినెస్ గ్రాడ్యుయేట్ అయిన సల్వా ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేయాల్సి వస్తున్నది.

# వినేశ్ తీర్పు వాయిదా

**ఫోగాట్'అనర్హత వేటు'పై తప్పని ఎదురుచూపులు • ఈ నెల 16కు వాయిదావేసిన కాస్**



**పసిడి విజేతలాగే స్వాగతిస్తాం : మహావీర్**

పారిస్: భారత కుస్తీ యోధురాలు వినేశ్ ఫోగాట్ 'అనర్హత వేటు'పై తీర్పు మరోసారి వాయిదా పడింది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. సరిగ్గా తుదిపోరుకు కొన్ని గంటల ముందు నిర్దేశిత బరువు కంటే వంద గ్రాములు అధికంగా ఉండటంతో ఒలింపిక్ నిర్వాహకులు ఆమెపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో సెమీస్‌లో తన చేతిలో ఓడినా ఫైనల్‌లో పోటీపడ్డ క్యూబా రెజ్లర్ లోపెజ్‌తో కలిసి తనకూ రజతం ఇవ్వాలని కోరుతూ వినేశ్.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (కాస్)ను ఆశ్రయించింది. ఈ కేసులో గడిచిన వారం రోజులుగా వాదోపవాదాలు వింటున్న కాస్ తీర్పును ఈనెల 16కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) మంగళవారం వెల్లడించింది. వినేశ్ కేసును వాయిదా వేయడం ఇది మూడోసారి. ఈనెల 7న ఆమె కాస్‌లో అప్పీల్ చేయగా అదే రోజు తీర్పు వస్తుందని భావించినా అది కాస్తా ఈనెల 11కు వాయిదా పడింది. ఆ తర్వాత దానిని 13 నుంచి తాజాగా మరోసారి 16కు పొడిగించడం గమనార్హం.

వినేశ్ పతకం విషయంలో సందిగ్ధత కొనసాగుతున్నా ఆమెకు స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్‌గానే స్వాగతం పలుకుతామని ఆమె బంధువు మహావీర్ ఫోగాట్ అన్నారు. 'కాస్ తీర్పు కోసం మేం వారం రోజులుగా వేచి చూస్తున్నాం. ఆమెకు రజతం దక్కుతుందని ఆశిస్తున్నాం. ఆమెకు ఏ పతకం వచ్చినా మేం మాత్రం ఆమెను పసిడి పతక విజేతగానే భావించి ఆ స్థాయిలోనే ఘన స్వాగతం పలుకుతాం. అంతేగాక ఆమె రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని లాస్ ఏంజెల్స్ (2028)లో పాల్గొనేలా ఒప్పిస్తాం' అని తెలిపారు.

**ఆమె యోధురాలు : శ్రీజేష్**

వినేశ్ అనర్హత వివాదంపై భారత మాజీ హాకీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ స్పందిస్తూ.. ''ఈ వ్యవహారంలో రెండు విషయాలున్నాయి. ఒకటి ఒక అథ్లెట్ ఫైనల్ చేరారంటే వాళ్లకు కచ్చితంగా ఏదో ఒక మెడల్ ఇవ్వాలి. మా కాంస్య పోరు మ్యాచ్‌కు ముందు నేను ఆమెను కలిశాను. అప్పుడు వినేశ్ నాతో 'భయ్యా. గుడ్ లక్. బాగా ఆడండి' అని చెప్పింది. ఆమె నవ్వు వెనుక ఉన్న బాధను నేను అర్థం చేసుకోగలను. ఆమె నిజమైన యోధురాలు. రెండో విషయం ఏంటంటే ఒలింపిక్ రూల్స్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాల్సిందే. ఆ విషయంలో ఫెడరేషన్‌కు, ఐవోసీ, ఐవోఏకు ఎలాంటి అవకాశమూ ఇవ్వకూడదు. ఇది అథ్లెట్లందరికీ గుణపాఠం. నియమ నిబంధనలనూ తూ.చా తప్పకుండా పాటించాలి'' అని అన్నాడు.

## అథ్లెట్లు పారదర్శకంగా ఉండాలి



ఢిల్లీ: విశ్వక్రీడల్లో యువ షట్లర్ లక్ష్యసేన్ నిరాశజనక ప్రదర్శనపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. కేంద్ర క్రీడా శాఖ, బాయ్ నుంచి నిధులు పొందుతున్న అథ్లెట్లు పారదర్శకంగా ఉండాలని, పతకాలు తీసుకురావడంలో బాధ్యతగా వ్యవహరించాలని తెలిపాడు. 'సెమీస్ మ్యాచ్‌లో లక్ష్య తొలి గేమ్‌ను 20-17తో ఆధిక్యంలో ఉన్నా ఆ తర్వాత చేతులెత్తేశాడు. కాంస్య పోరులోనూ అదే తంతు. క్రీడామంత్రిత్వ శాఖ, బాయ్ మీకు అన్ని వసతులు సమకూరుస్తోంది. మిమ్మల్ని అక్కడికి (ఒలింపిక్స్)కు ఎందుకు పంపిందనే విషయాన్ని గుర్తెరిగి బాధ్యతగా వ్యవహరించాలి. పతకాలు తీసుకురావడానికే కదా విదేశాలకు వెళ్లింది. కోర్టులో చక్కర్లు కొట్టడానికి కాదు కదా' అంటూ ఓ కాలమ్‌లో రాసుకొచ్చాడు. అథ్లెట్లపై ప్రకాశ్ పదుకునే చేసిన వ్యాఖ్యలను గవాస్కర్ సమర్థించాడు.



## లష్కర్ ఏ తోయిబా లీడర్‌తో అర్షద్

లాహోర్: పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా జావెలిన్ త్రోలో రికార్డు త్రో విసిరి స్వర్ణం గెలిచిన పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ వివాదంలో చిక్కుకున్నాడు. పసిడి గెలిచి స్వదేశానికి తిరిగొచ్చిన అతడిని నిషేధిత తీవ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబా నాయకుడు హరీస్ ధార్ కలవడం వివాదాస్పదమైంది. నదీమ్ ఇంటికి వెళ్లిన హరీస్.. అతడి భుజంపై చేయి వేసి మాట్లాడిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయ్యింది. అయితే ఈ వీడియో ఎప్పటిదనేదానిపై స్పష్టత లేదు. ఇదిలా ఉండగా స్వర్ణం గెలిచిన నదీమ్‌పై నజరానాలు వెల్లువెత్తుతున్నాయి. పంజాబ్ ప్రావిన్సు చీఫ్ మినిస్టర్ మర్యమ్ నవాజ్ అతడికి పాకిస్థాన్ పది మిలియన్ రూపాయలతో పాటు హోండా కారును అందజేశారు. కారుకు 92.97 నంబర్ కేటాయించడం విశేషం. ఒలింపిక్స్‌లో నదీమ్ విసిరిన త్రో ఇదే కావడం గమనార్హం.

## బంగ్లా, ఇంగ్లండ్ సిరీస్‌లకు వేదికలు మార్పు

ముంబై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే టీ20 సిరీస్‌తో పాటు టీమ్ఇండియా వచ్చే ఏడాది ఇంగ్లండ్‌తో ఆడనున్న సిరీస్ వేదికల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 6న ధర్మశాల వేదికగా భారత జట్టు తొలి టీ20 ఆడాల్సి ఉండగా స్టేడియంలో మరమ్మతుల కారణంగా ఆ మ్యాచ్‌ను గ్వాలియర్ (మధ్యప్రదేశ్)కు తరలించారు. మిగిలిన మ్యాచ్‌లలో మార్పులేమీ లేవు. ఇక తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భాగంగా 2025 జనవరి 22న చెన్నైలో మొదటి, 25న కోల్‌కతాలో రెండో మ్యాచ్ జరుగాల్సి ఉంది. కానీ ఈడెన్ గార్డెన్‌లో తొలి టీ20, చెపాక్‌లో రెండో టీ20 జరుగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.



పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టు సభ్యులు మంగళవారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. వీరికి హాకీ ఇండియా(హెచ్ఐ) ప్రతినిధులతో పాటు అభిమానులు ఘన స్వాగతం పలికారు.

## నీరజ్‌తో మనువు!

**అవన్నీ వదంతులేనన్న భాకర్ తండ్రి**



ఝజ్జర్ (హర్యానా): డబుల్ ఒలింపిక్ మెడలిస్టులు నీరజ్ చోప్రా, షూటర్ మను భాకర్ పెళ్లి చేసుకోబోతున్నారా? ఇటీవల ఈ ఇద్దరూ పారిస్‌లో నీతా అంబానీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'ఇండియా హౌస్'లో సత్కార కార్యక్రమం సందర్భంగా కలిసి ముసి ముసి నవ్వులు చిందించుకుంటూ ముచ్చటించుకోవడం, అదే వేదుకలో మను తల్లి నీరజ్‌తో ఒట్టు వేయించుకున్న వీడియోలు నెట్టింట వైరల్ అవడంతో సోషల్ మీడియాలో ఈ ఇద్దరూ ఒక్కటవబోతున్నారన్న చర్చ జోరందుకుంది. దీనిపై తాజాగా మను తండ్రి రామ్ కిషన్ మాట్లాడుతూ తమకు అలాంటి ఆలోచనే లేదని కొట్టిపారేశాడు. 'మను చిన్నపిల్ల. తనకింకా పెళ్లీడు రాలేదు. మాకు ఇప్పట్లో ఆమె వివాహం గురించిన ఆలోచన లేదు' అని అన్నాడు. మను తల్లి నీరజ్‌నూ కొడుకుగా భావిస్తుందని వీడియోలో ఆ ఇద్దరి మధ్య ఉన్న ఆప్యాయతను చూడొచ్చని తెలిపాడు. ఇదే విషయమై నీరజ్ సమీప బంధువు ఒకరు స్పందిస్తూ.. 'దేశానికి నీరజ్ రెండో పతకం అందించాడు. ఆ విషయం దేశం మొత్తానికి తెలుసు. అలాగే అతడు పెండ్లి చేసుకునేటప్పుడూ అందరికీ తెలుస్తుంది' అని చెప్పాడు.

## పారాలింపిక్స్‌లో 25కు పైగా పతకాలు సాధిస్తాం




జైపూర్:పారిస్ వేదికగా జరుగనున్న పారాలింపిక్స్‌లో 25కు పైగా పతకాలు సాధిస్తామని భారత పారాలింపిక్ కమిటీ(పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నెల 28 నుంచి మొదలుకాబోతున్న పారాలింపిక్స్‌లో భారత్ 84 మందితో కూడిన భారీ బృందంతో బరిలోకి దిగబోతున్నది. గత టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలు గెలిచిన భారత బృందం..ఆసియా పారాగేమ్స్‌లో 111 పతకాలతో కొత్త చరిత్ర లిఖించింది. మంగళవారం మీడియా సమావేశంలో దేవేంద్ర మాట్లాడుతూ 'పారిస్ పారాలింపిక్స్‌లో భారత ప్లేయర్లు మొత్తం 12 విభాగాల్లో పోటీపడుతున్నారు. మెగాటోర్నీ కోసం అథ్లెట్లు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారు. కచ్చితంగా 25కు పైన పతకాలు గెలుస్తామన్న నమ్మకం ఉంది. మరీ ముఖ్యంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, షూటింగ్‌లో మంచి ఫలితాలు వస్తాయి.

## • ఇదీ తరగతి గదే!



*మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం గుడిమల్కాపూర్ పాఠశాల తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరింది. ప్రాథమికోన్నత పాఠశాలలో 7 తరగతులకుగాను 70 మంది చదువుతున్నారు. మంగళవారం ఉదయం కురిసిన వానకు ఉన్న మూడు గదుల్లోకి నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం తగ్గాక పంచాయతీ సిబ్బంది వరద నీటిని ఎత్తిపోశారు. - హన్వాడ*

## • రోడ్డు ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా?



*సంగారెడ్డి పట్టణంలోని 17వ వార్డు హాస్టల్‌గడ్డలోని తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలకు వెళ్లే దారి మొత్తం బురదమయంగా మారింది. బాటకు ఇరువైపులా పచ్చి గడ్డి ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉంది. స్కూల్ చుట్టూ విపరీతంగా గడ్డి పెరగడంతో విష పురుగులు సంచరించే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.*

*-నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా*

## వేణుస్వామికి మహిళా కమిషన్ సమన్లు

• **22న హాజరుకావాలని ఆదేశం**

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులపై వ్యాఖ్యలు చేసిన ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామిని ఈ నెల 22న వ్యక్తిగతంగా హాజరు కావాలని రాష్ట్ర మహిళా కమిషన్ సమన్లు జారీ చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినీ నటులు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల నిశ్చితార్థం సందర్భంగా వేణుస్వామి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్లు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సమన్లు జారీ చేసింది. గతంలో కూడా సినిమాలు, రాజకీయాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేసి విమర్శలపాలైన విషయం తెలిసిందే.

## ఏపీ నుంచి తెలంగాణకు 122 మంది ఉద్యోగులు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్థానికత ఉండి.. రాష్ట్ర విభజన సమయంలో కమలనాథన్ కమిటీ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణకు రిలీవ్ అవుతున్న ఉద్యోగులు తమ కేడర్‌లోనే చివరి ర్యాంక్‌లో విధుల్లో చేరుతారని స్పష్టం చేసింది.

## ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడిని కాపాడిన డ్రైవర్

- **ఫిట్స్ రావటంతో ఆర్టీసీ బస్సులోనే దవాఖానకు తరలింపు**
- **మానవత్వం చాటిన డ్రైవర్‌కి సన్మానం**

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సులో ఫిట్స్ వచ్చిన ప్రయాణికుడిని సకాలంలో దవాఖానలో చేర్పించి డ్రైవర్ ఉదారత చాటుకున్నారు. వరంగల్-2 డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి హన్మకొండకు సోమవారం వెళ్తున్నది. హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్ దాటగానే సంతోష్ అనే ప్రయాణికుడికి ఫిట్స్ వచ్చింది. తోటి ప్రయాణికులు విషయాన్ని డ్రైవర్ బీ వెంకన్న దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుడిని పరిశీలించిన డ్రైవర్.. వెంటనే మరో ప్రయాణికుడు శ్రీనివాస్ సహకారంతో బీబీనగర్‌లోని ఎయిమ్స్ దవాఖానకు బస్సును తీసుకెళ్లారు. సంతోష్‌ను సకాలంలో దవాఖానలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. మానవత్వంతో వ్యవహరించిన డ్రైవర్ బీ వెంకన్నను హైదరాబాద్ బస్ భవన్‌లో మంగళవారం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సన్మానించారు. సంతోష్‌ను దవాఖానకు తరలించడంలో డ్రైవర్‌కి సహకరించిన ప్రయాణికుడు శ్రీనివాస్‌కు, వైద్యం అందించిన ఎయిమ్స్ వైద్య బృందానికి ఎండీ సజ్జనార్ అభినందనలు తెలిపారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.